క్లుప్తంగా

ఖురాన్ ప్రతుల అందజేత



వైద్యులకు ఖురాన్ ప్రతిని అందిస్తున్న గాజుల బాజీ

ఏలూరు (టూటౌన్): రంజాన్ పండుగ సందర్భంగా నూర్ బాషా ముస్లిం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైద్ బాజీ (గాజుల బాజీ) ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయమ్మ, డాక్టర్ సికింద్ర మోహన్‌లకు దివ్య ఖురాన్ ప్రతి, ఖర్జూరం ప్యాకెట్లను బుధవారం అందజేశారు. జిల్లా ప్రజలకు వైద్యులు చేస్తోన్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నూర్ బాషా ముస్లిం సంఘ నాయకులు షేక్ సత్తార్ పాల్గొన్నారు.

నూకాలమ్మవారికి ముక్కుపుడక సమర్పణ



ముక్కుపుడకను ఈఓ సన్యాసిరావుకు అందిస్తున్న భక్తుడు శివశంకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మవారి ఆలయంలో అమ్మవారికి కొత్తపేటకు చెందిన మంతెన శివశంకర్ అనే భక్తుడు రూ.1,10,070 విలువ చేసే 17.770 గ్రాముల బంగారంతో ఆకుపచ్చరాయి పొదిగిన ముక్కుపుడకను సమర్పించారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు పేర్కొన్నారు.

సీఆర్‌ఆర్ విద్యార్థినులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఆర్‌ఆర్ ప్రిన్సిపాల్ పి.శైలజ తెలిపారు. సీఆర్‌ఆర్ కళాశాలలో ఈ నెల 6న కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న వీరవల్లి ఆక్వా ఎక్స్ఛేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 56 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. గతేడాది డిగ్రీ పూర్తి చేసుకున్నవారితో పాటు ఈ ఏడాది తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎనిమిది మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ శైలజ అభినందించారు.

ప్రతి ఇంటికీ పథకాలు జగన్ ఘనతే

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని
- 34, 17 డివిజన్లలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం





34వ డివిజన్‌లో సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు, 34వ డివిజన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని 34, 17 డివిజన్లలో ఆయన వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. 34వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, 17వ డివిజన్ కార్పొరేటర్ పాము పద్మ శామ్యూల్ ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశాలకు ఆయా డివిజన్లలో పార్టీ నేతలు, క్యాడర్ సంఖ్యలో హాజరయ్యారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలిస్తూ మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలు ఎన్ని అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలు, రైతులు, అన్ని వర్గాల వారినీ దారుణంగా మోసం చేశారని గుర్తుచేశారు. 2019లో ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం అమలు చేసి చూపించారని వివరించారు.



17వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ప్రజలు నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా హామీ ఇస్తే చేస్తారనే నమ్మకంతో ఉన్నారని, చంద్రబాబును విశ్వసించటం లేదని చెప్పారు. ఏలూరు జిల్లాలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతామని ఆయన తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్–3 పార్టీ అధ్యక్షులు మంచెం మైబాబు, స్థానిక నాయకులు సింహాద్రి సృజన్, బాలత్రిపుర సుందరి, చింతలపూడి సత్యనారాయణ, దుర్గారావు తదితరులు ఉన్నారు.

శ్రీసీతారామ కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే నానికి ఆహ్వానపత్రిక అందిస్తోన్న ఆలయ కమిటీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ 3వ డివిజన్ రామాలయంలో ఈనెల 17న నిర్వహించే శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానికి ఆలయ కమిటీ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని కలిసిన ఆలయ కమిటీ పైలా కనకారావు, మహిళలు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే నాని సూచించారు.

నగరంలో దర్గా భూమి ఆక్రమణ



దర్గా భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక దక్షిణపు వీధి పోణంగి రోడ్డులో ఉన్న హజ్రత్ పాషా షహీద్ మహాత్ముల దర్గా భూమి ఆక్రమణపై ఆ దర్గా ముతవల్లీ వారసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ దర్గాకు నగరంతో పాటు పోణంగిలో ఉన్న నివేశన స్థలాలు, పొలాలు ఆ దర్గా వంశపారంపర్య ముతవల్లీ ముర్తజా అలీ నోటిఫైడ్ ముతవల్లీగా వ్యవహరిస్తూ గతంలోనే మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన వారసులు ఈ దర్గాను నిర్వహిస్తున్నారు. నగరంలోని ఈ దర్గాకు ఉన్న 3.14 ఎకరాల స్థలంలో కొంతభాగం గతంలో ఆక్రమణకు గురవ్వగా, ఇటీవల ఆ స్థలంలో సుమారు 300 గజాలు చదును చేసి భవన నిర్మాణం నిమిత్తం కొందరు ముగ్గు కూడా వేయడంతో ముర్తజా అలీ మనుమడు మీర్ మజర్ అలీ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు, మున్సిపల్ అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎస్‌శ్రీం బాషా ఖాద్రీ మాట్లాడుతూ పాషా షహీద్ మహాత్ముని దర్గా భూములు వక్ఫ్‌బోర్డు గెజిట్‌లో నోటిఫై అయ్యాయని, ఆ భూములను ఆక్రమించడానికి వీలులేదని అన్నారు. ఆక్రమణలపై వక్ఫ్‌బోర్డు తరఫున పోలీసులకు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు వక్ఫ్‌బోర్డు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల్లో ఏలూరు పెన్షన్‌మహాల్లా మజ్జిద్



లక్ష్మీవారపుపేటలోని మజ్జిద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఏలూరు నగరంలోని ప్రార్థనా మైదానాలను, మసీదులను ముస్లింలు ముస్తాబు చేశారు. రంజాన్ నెల ఉపవాస దీక్షలు గత నెల 12 నుంచి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇప్పటికే విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలకు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టిప్‌టాప్ పందిళ్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. స్థానిక వంగాయగూడెం రోడ్డులోని ఈద్‌గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు రంజాన్ ప్రార్థనలు చేస్తారు. నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో పాత బస్టాండు సెంటర్‌లోని కర్బలా మైదానంలో ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయి. ఆయా ప్రాంగణాల్లో నిర్వహించే ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలు పాల్గొని రంజాన్ మాసం ప్రాశస్త్యాన్ని వివరిస్తారు. జకాత్, ఫిత్రా దానాల ప్రాధాన్యతలపై అవగాహన కల్పిస్తారు. లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్ మసీదులో ఉదయం 7.30 గంటలకు, ఉమర్ ఏ ఫరూఖ్ మసీదులో ఉదయం 8.00 గంటలకు, మర్కజ్ ఈనామ్ మసీదులో ఉదయం 9.00 గంటలకు, తంగెళ్లమూడిలోని నెహర్ మసీదులో ఉదయం 8.30 గంటలకు, రాజీ నగర్‌లోని పురానా మసీద్‌లో ఉదయం 9.15గంటలకు, నయా మసీదులో ఉదయం 9.00 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయి. నగరంలో జామియా మసీదు, చౌక్ మసీదు, ఖురేషీ మసీదు, నాథూమియా మసీదు, మదీనా మసీదు, అక్కిలేట్ మసీదు, ఎం ఎం కాలనీ మసీదు, మాదేపల్లి మసీదు, గేట్ మసీదు, జమీరాత్ మసీదు, బీడీ కాలనీ మసీదు, ఇస్లాం పేట మసీదు, ఫాతిమా మసీదు, జిల్లా మసీదు, శనివారపు పేట మసీదు, దొండపాడు మసీదు, మహ్మదీయ మసీదు, వైఎస్సార్ కాలనీ మసీదు, తబ్‌లిక్ జమాత్ మసీదు, నూర్ మసీదుల్లో సైతం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

సేవా కార్యక్రమాలు మానవత్వానికి ప్రతీక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి సేవా కార్యక్రమాలు నిర్వహించడం మానవత్వానికి ప్రతీకగా నిలుస్తాయని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తొండెపు హనుమంతరావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఇంద్రప్రస్థలో వాసవి జాగృతి ఇంటర్నేషనల్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవ ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలన్నారు. వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు తిరివీధి వేణుగోపాల్ గుప్తాను అభినందించారు. తిరివీధి వేణుగోపాల్ గుప్తా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విద్య, రక్తదానం, నేత్రదానం,



వాసవి జాగృతి ఇంటర్నేషనల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సభ్యులు

అన్ని ప్రమాదాల బాధితులకు సాయంతోపాటు వివిధ కోర్సుల్లో శిక్షణ, మోటివేషన్, కౌన్సెలింగ్ శిబిరాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్నట్టు తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖులు కేకే గుప్తా, అత్యం నరేందు మోహన్ గుప్తా సంస్థకు చెందిన వివిధ విభాగాలను ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు నాగసూరి మురళీమోహనరావు, ఊటుకూరి కిరణ్, జూలూరి కాశీ విశ్వనాథం, తిరివీధి వరలక్ష్మి, బచ్చు సాయిరామ్, దారా శ్రీనివాస్, గట్టుపల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	04-06
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	04,06
బెండకాయలు	20	కంద	56
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	28	కీరా దోస	30
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32–40	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	గోంగూర	08
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు –తిరుపతి	16.00	4830	32

జూట్ మిల్లు తెరిపించాలని వినతి

ఏలూరు (టూటౌన్): చట్ట విరుద్ధంగా మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెరిపించాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ సంఘాలు జూట్ మజ్దూర్ యూనియన్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జేసీఎల్) కార్యాలయాల వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.పోలారి, బద్దా వెంకట్రావులు మాట్లాడారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పెదపాడుకు చెందిన గారపాటి శ్రీహరి నారాయణ బుధవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తొలుత ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ గిరిజారాణి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెదవేగి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిక అధికారి కేపీఏల్ పద్మావతి, డీసీపీఓ డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి అన్నారు. బుధవారం పెదవేగి మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు చట్టపరమైన చర్యలు, శిక్షలపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపిల్లలకు విద్యనందించి వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ రెండు రోజుల్లోనే 12 బాల్యవివాహాలు నిలుపుదల చేశామని వారు తెలిపారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098, లేదా 9491063810 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

'పార్కిన్‌సన్' దీర్ఘకాలిక వ్యాధి



కార్యక్రమలో పాల్గొన్న వైద్యులు,దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది

ఏలూరు (టూటౌన్): పార్కిన్‌సన్ అనేది దీర్ఘకాలిక వ్యాధి అని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తి ప్రియాంక అన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ప్రపంచ పార్కిన్‌సన్ డేను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కీర్తి ప్రియాంక మాట్లాడారు. మెదడులో హార్మోన్ లోపం వల్ల వచ్చే వ్యాధి పార్కిన్‌సన్ అన్నారు. మెదడులో డొపామైన్ హార్మోన్ ఆగడం వల్లే ప్రభావం మొదలవుతుందని, ఆకస్మికంగా మనిషి అవయవాలు పనిచేయకుండా మారే వ్యాధి పార్కిన్‌సన్ అని వివరించారు. హార్మోన్ నెమ్మదిస్తే కండరాల చురుకుతనం తగ్గడం, శరీరంలో వణుకు రావడం, నోరు బిగిసిపోవడం, చొంగ కార్చడం, శరీరం అదుపు తప్పడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ వ్యాధి గతంలో 60 సంవత్సరాలు పైబడిన వారిలో వచ్చేదన్నారు. నేడు ఇది 40 సంవత్సరాలు పైబడిన వారికి, యువకుల్లో కూడా వ్యాపిస్తోందని చెప్పారు. ఈ వ్యాధి మగవారిలోనే ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. దీన్ని ఐదు దశలుగా గుర్తించవచ్చునని, మొదటి దశలో ఒక వైపు, రెండో దశలో రెండు వైపులా, మూడో దశలో నడక ఇబ్బంది, నాలుగో దశలో అసలు నడవలేని పరిస్థితి, ఐదో దశ పూర్తిగా మంచం మీద ఉండే పరిస్థితి అని అన్నారు. మొదటి, రెండో దశల్లోపు మందులతో నియంత్రించవచ్చని, ఆపై మూడు దశల్లో మందులు పనిచేయవని, ఆపరేషన్ చేస్తారని చెప్పారు. ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా సరైన ఆహారం, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

12న విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని 18 సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 12న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యలగూడెం, బోడిగూడెం , వేగవరం, తాడువాయి, చల్లవారిగూడెం, దర్భగూడెం, చీమలవారిగూడెం, జీలుగుమిల్లి, ఆడమిల్లి, తడికలపూడి, లక్కవరం, పేరంపేట, కేతవరం , రాజవరం, బండివారిగూడెం, రేచర్ల, సీతానగరం, పట్టాయిగూడెం గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

కొయ్యలగూడెం : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి టీఎన్ స్నేహన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల నిర్వహణకు ఏప్రిల్ ఒకటో తేదీనే రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ పేరున ఆదేశాలు వెలువడ్డాయని తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అడ్డురాదని, రాజకీయ అంశాలు ప్రస్తావనకు రాకూడదని పేర్కొన్నట్టు వివరించారు. ఈ ఆదేశాలు ప్రకారం ప్రతి జిల్లాలో ప్రభుత్వ పరంగా నాయకుల జయంతి వేడుకలు నిర్వహించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం



కొవ్వలిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్ బాషా

దెందులూరు : అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం మండలంలోని కొవ్వలిలో పంటలకు నీటి సరఫరా పరిస్థితిని ఆయన పరిశీలించారు. సమీప గ్రామ రైతులను కలిసి తాగునీరు సరఫరా, రైతుల అవసరాలు, విద్యుత్ సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొవ్వలి, దెందులూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకున్న కళ్లాలను పరిశీలించారు. అనంతరం వరి కోతలు చేస్తున్న పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. దెందులూరు మండలంలో 16 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో సిబ్బందిని నియమించామని తెలిపారు. అన్నారు. ఆయన వెంట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు, దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ ఉన్నారు. అనంతరం కొవ్వలి సొసైటీలోకి వెళ్లి గోనె సంచుల నిల్వలను, వివరాలను, బ్యాంకు చైర్మన్ కొమ్మిన రాము, కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం గోనె సంచులను సరఫరా చేస్తామని వివరించారు. ఆయన వెంట దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి గద్దె రమేష్, రైతులు ఉన్నారు.